మహిళలకు భద్రతనివ్వని సర్కారిది!

› మొదటిపేజీ తరువాయి...

మండిపడ్డారు. ఘోర నేరాల్లో బాధితులకు న్యాయం దక్కకపోవడం శోచనీయమని పేర్కొన్నారు. తెలంగాణలో 163కు పైగా ప్రధాన కేసులు పరిష్కారం కాకపోవడం, రూ.10 కోట్ల విలువైన ఆర్థిక మోసాలకు సంబంధించి రికవరీ జరగకపోవడం సర్కారు అసమర్థతకు నిదర్శనమని విమర్శించారు. రాష్ట్రంలో నేరాల గుర్తింపు 31 శాతం ఉన్నదని, బీహార్ లాంటి రాష్ట్రంతో పోటీపడే పరిస్థితి రావడం దురదృష్టకరమని, ఘటన జరిగిన మొదటి వారమైన గోల్డెన్ పీరియడ్‌ను వృథా చేయడంవల్లే బాధితులకు న్యాయం దక్కడంలేదని అభిప్రాయపడ్డారు. వివిధ కేసుల్లో నిందితులు యథేచ్ఛగా తిరగడం చూస్తే పోలీసుల వైఫల్యం కొట్టొచ్చినట్టు కనబడుతున్నదని దెప్పిపొడిచారు. సీఎం రేవంత్ పాలనా వైఫల్యంతో తెలంగాణ పోలీసులు నైపుణ్యాలు, శక్తిని కోల్పోతున్నారని, రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించడానికి హోంమంత్రిగా వ్యవహరిస్తున్న ముఖ్యమంత్రి వైఫల్యమే కారణమని విమర్శించారు. ప్రజాభద్రతను గాలికొదిలిసిన ప్రభుత్వ పెద్దలు రాజకీయ దాడులకు పాల్పడటం దుర్మార్గమని, ప్రశ్నిస్తే కేసులు పెట్టడం, సోషల్ మీడియాలో అభిప్రాయాలు పంచుకుంటే వేధించడం ఈ ప్రభుత్వానికి రివాజుగా మారిందని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఆఖరికి పేరు మరిచిపోతే కూడా కేసులు పెడుతూ ఇబ్బందిపెట్టడం ఈ సర్కారుకే చెల్లిందని ఎద్దేవాచేశారు. ప్రభుత్వ పెద్దలు పోలీసు వ్యవస్థను రాజకీయ కక్ష సాధింపునకు వాడుకోకుండా ప్రజాభద్రతకు వినియోగించాలని చురకలంటించారు. మెరుగైన శాంతిభద్రతల నిర్వహణకు పోలీసుశాఖకు కేటాయించిన బడ్జెట్‌ను విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

తెలంగాణ పోలీస్ కొత్త లోగో

హైదరాబాద్, డిసెంబర్ 29 (నమస్తే తెలంగాణ) : తెలంగాణ పోలీస్ లోగో మారింది. పదేండ్లపాటు 'తెలంగాణ స్టేట్ పోలీస్' అని ఉండగా.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 'స్టేట్' అనే పదాన్ని తొలగించి 'తెలంగాణ పోలీస్'గా మార్చారు. గత నెలలో హోంశాఖ ప్రత్యేక కార్యదర్శి చేసిన ఉత్తర్వుల మేరకు.. లోగోతోపాటు బ్యాడ్జీలు, క్యాపులు, బెల్టులను మార్చారు. అందుకు సంబంధించిన బడ్జెట్‌ను హోంశాఖకు పంపగా.. అందరికీ కొత్త లోగోలు పంపిణీ చేసినట్టు తెలిసింది. లోగో మార్పుపై తెలంగాణ పోలీస్ ట్విటర్ హ్యాండిల్‌లో పోస్టు చేశారు.

3 గంటలకో రేప్ 5 గంటలకో కిడ్నాప్

› మొదటిపేజీ తరువాయి...

పనితీరుకు, శాంతిభద్రతల పరిస్థితికి అద్దం పట్టే వివరాలను డీజీపీ జితేందర్ ఆదివారం వార్షిక క్రైం నివేదిక రూపంలో వెల్లడించారు. గత సంవత్సరంతో పోలిస్తే ఈ ఏడాది మొదటి 11 నెలల్లో అన్ని రకాల నేరాలు 10శాతం పెరిగినట్టు ఆ నివేదిక వెల్లడించింది. ఇందులో తీవ్రమైన నేరాలు 22.53 శాతం పెరగడం ఆందోళనకరం. పోలీసు శాఖ తమ పనితనాన్ని కప్పిపుచ్చుకొనేందుకు మునుపెన్నడూ లేనివిధంగా ఈసారి 2020లో జరిగిన నేరాలతో 2024లో జరిగిన వాటి సంఖ్యను పోల్చే ప్రయత్నం చేసింది. ఈ క్రమంలో నేరాల పెరుగుదల శాతాన్ని తగ్గించి చూపేందుకు 'నెట్ వేరియేషన్' అనే ఆప్షన్ పెట్టింది. దీనిపై మీడియా వేసిన ప్రశ్నలకు డీజీపీ సమాధానం చెప్పలేక సీఐడీ డీజీ శిఖాగోయెల్‌ను చెప్పమని కోరారు. ఆమె ఇచ్చిన సమాధానంతో పాత్రికేయులు సంతృప్తి చెందలేదు.

మహిళలు, ఎస్సీ ఎస్టీల పట్ల పెరిగి నేరాలు

రాష్ట్రంలో మహిళలు, ఎస్సీ, ఎస్టీలపై నేరాల సంఖ్య దారుణంగా పెరిగింది. గతంతో పోల్చితే రేప్‌కేసులు 2945 (28.94%), మహిళల హత్యలు 13.15శాతం పెరిగాయి. ఆత్మహత్యకు ప్రేరేపించిన కేసులు 363 పెరిగాయి. దీంతో మహిళలను కంటికి రెప్పలా చూసుకుంటున్నామని చెప్పున్న మాటలు నీటి మూటలేనని తేలిపోయింది. ఇక ఎస్సీలు, ఎస్టీలపై జరిగిన నేరాలు ప్రభుత్వ నిర్లక్ష్యపూరితమైన పాలనకు అద్దం పడుతున్నాయని నిపుణులు విమర్శిస్తున్నారు. నిరుడు ఎస్సీ, ఎస్టీలపై 1,877 కేసులు నమోదు కాగా.. ఈ ఏడాది 11 నెలల్లోనే 2,257 (20.24% పెరుగుదల) కేసులు నమోదయ్యాయి. ఈ బాధితుల్లో 18 ఏండ్ల లోపు వారు 1251 మంది ఉండగా.. 18 ఏండ్లు పైబడిన వారు 274 మంది ఉన్నారు.

పెరిగిన క్రైమ్ రేట్.. తగ్గిన శిక్షలు!

ఈ ఏడాది 11 నెలల్లో రాష్ట్రవ్యాప్తంగా 2,34,158 కేసులు నమోదయ్యాయి. ఈ సంఖ్య నిరుడు 2,13,121గా నమోదైంది. దీంతో మొత్తం కేసుల్లో క్రైమ్ రేట్ 9.87శాతం పెరిగినట్టు వెల్లడైంది. 2023లో 39,371 కేసుల్లో శిక్షలు పడగా, ఈ ఏడాది కేవలం 28,477 కేసుల్లో మాత్రమే (-27.67శాతం) శిక్షల రేటు నమోదైంది. వీటిలో 3 మరణ శిక్షలు ఉన్నాయి. 18 జీవిత ఖైదు, మూడేండ్ల నుంచి ఏడేండ్లకు పైగా శిక్షలు 9, ఏడాది నుంచి 3 ఏండ్లకు విధించిన శిక్షలు 11 ఉన్నాయి. ఇక 3 రేప్ కేసుల్లో నలుగురికి జీవిత ఖైదు, మరో 5 కేసుల్లో ఐదుగురికి 20 ఏండ్ల జైలు విధించారు. మహిళల పట్ల నేరాలకు పాల్పడిన 51 కేసుల్లో 70 మందికి జీవిత ఖైదు విధించారు. ఇక 77 పోక్సో కేసుల్లో, 82 మందికి జీవిత ఖైదు విధించారు.

రాష్ట్రం ప్రశాంతంగా ఉంది: డీజీపీ జితేందర్

ఒకటి రెండు ఘటనలు మినహా రాష్ట్రం ప్రశాంతంగా ఉందని వార్షిక క్రైమ్ నివేదిక విడుదల సందర్భంగా డీజీపీ జితేందర్ తెలిపారు. రాష్ట్రంలో మొత్తంగా నేరాల సంఖ్య 9.87 శాతం పెరిగిందని అంగీకరించారు. సైబర్ నేరాలు 43.44 శాతం పెరిగాయని, డ్రగ్స్‌పై ఉక్కుపాదం మోపుతున్నామని చెప్పా రు. గంజాయి 20 టన్నులు సీజ్ చేశామని, పెద్ద మొత్తంలో సింథటిక్ డ్రగ్స్ స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఈ ఏడాది 215 మందికి జీవిత ఖైదు పడిందని, 3 కేసుల్లో దోషులకు ఉరిశిక్ష పడిందని చెప్పారు. 23,491 రోడ్డు ప్రమాదాలు నమోదు కాగా 6,640 మంది మృతిచెందినట్టు తెలిపారు. మహిళలపై దాడులు, వేధింపులు 4.78 శాతం పెరిగాయని పేర్కొన్నారు. నిబంధనలు పాటించని ప్రైవేటు ఏజెన్సీలు, బౌన్సర్లపై చర్య లు తీసుకుంటామని వెల్లడించారు. సోషల్ మీడియాపై ప్రత్యేక పర్యవేక్షణ ఏర్పాటు చేశామని, సైబర్ క్రైమ్ ఇన్వెస్టిగేషన్ పేరుతో సోషల్ మీడియా ప్రచారాలపై దర్యాప్తు చేస్తామని చెప్పారు. ఎస్పీ, డీఎస్పీ స్థాయి అధికారులు తమ కిందిస్థాయి సిబ్బంది ప్రవర్తనపై నిఘా పెట్టాలని, ఎవరైనా స్టేషన్‌కు వచ్చే మహిళలను ట్రాప్ చేస్తే ఉపేక్షించేది లేదని, శాఖాపరమైన చర్యలు తీసుకునేందుకు వెనుకాడవద్దని తెలిపారు. డీజీలు శివధర్‌రెడ్డి, శిఖా గోయల్, అభిలాష బిస్త్, ఏడీజీలు మహేశ్ భగవత్, సంజయ్‌కుమార్ జైన్, విక్రమ్‌సింగ్ మాన్, ఐజీలు సత్యనారాయణ, సుధీర్‌బాబు, సుమతి, రమేశ్‌నాయుడు, చంద్రశేఖర్‌రెడ్డి, రమేశ్, ఐపీఎస్ వినీత్ పాల్గొన్నారు.

మర్డర్లు

ఫ్యామిలీ వివాదాల్లో -	229
నగదు వివాదాల్లో -	53
లైంగిక కారణాలతో -	102
భూ వివాదాల్లో -	82
చిన్నపాటి గొడవల వల్ల జరిగిన హత్యలు -	82
ఇతర కారణాల వల్ల -	259

రేప్‌లు

తెలిసిన వారు చేసిన రేప్‌లు 2,922

గుర్తు తెలియని వ్యక్తులు చేసిన రేప్‌లు 23

99.2% తెలిసిన వారే రేప్‌లు చేస్తున్నారు

15 ఏండ్ల లోపు బాధితులు 87 మంది

15-18 ఏండ్ల వారు 1970 మంది

18 ఏండ్లు పైబడిన వారు 888 మంది

క్రైమ్ రిపోర్ట్‌లో కీలక అంశాలు

- *భారీగా పెరిగిన డ్రగ్స్ వినియోగం: ఈ ఏడాది మన రాష్ట్రంలో డ్రగ్స్ వినియోగం భారీగా పెరిగింది. ఈ సారి 1942 కేసులు నమోదు చేసి.. 4,682 మందిని అరెస్టు చేశారు. వారి నుంచి రూ.142 కోట్ల విలువైన డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఎన్డీపీఎస్ యాక్ట్‌ను ఉపయోగించి నిందితులకు చెందిన రూ.55.8 కోట్ల ఆస్తులను జప్తు చేశారు.*
- *మావోయిస్టులపై ఉక్కుపాదం: ఈ ఏడాది 14 మంది మావోయిస్టు నాలుగు ఎదురుకాల్పుల ఘటనల్లో మృతిచెందారు. మొత్తం 85 మందిని అరెస్టు చేయగా, 41 మంది సరెండర్ అయ్యారు.*
- *ఈ ఏడాది 38,231 ఫోన్లను సీఈఐఆర్ పోర్టల్ ద్వారా రికవరీ చేసినట్టు డీజీపీ తెలిపారు.*
- *తెలంగాణలో తొలిసారిగా 1000 మందితో ఎస్టీఆర్ఎఫ్ టీమ్‌ను ఏర్పాటు చేశారు.*
- *షీటీమ్స్ ద్వారా ఈ ఏడాది 10,862 ఫిర్యాదులు స్వీకరించగా, వాటిల్లో 830 ఎఫ్ఐఆర్‌లు చేశారు. 3,329 పెట్టీ కేసులు ఉండగా, 15,664 మందికి కౌన్సెలింగ్ ఇచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా 27 భరోసా సెంటర్ల ద్వారా మహిళలకు సేవలందిస్తున్నారు.*

(2020 నుంచి 2024 వరకు) (జనవరి-నవంబర్ వరకు)

వివిధ నేరాలు	2020	2021	2022	2023	2024	పెరిగిన శాతం
1. డబ్బు కోసం హత్యలు	44	85	51	59	83	40.67
2. హత్యలు	660	838	780	789	856	8.49
3. లైంగికదాడులు	1,934	2,382	2,293	2,284	2,945	28.94
4. ఉద్దేశపూర్వక హత్యలు	198	389	223	171	222	29.82
5. కిడ్నాప్‌లు	1,033	1,218	1,308	1,362	1,525	11.96
6. దొంగతనాలు	8,330	12,531	14,494	14,393	19,480	35.34
7. దోపిడీలు	305	441	501	495	703	42.02
8. బందిపోటు దొంగతనాలు	30	37	29	42	58	38.09
9. రాత్రివేళ దొంగతనాలు	3,476	4,335	4,431	4,803	5,724	19.17
10. అల్లర్లు	708	488	402	447	324	-27.51
11. గాయపరచడం	18,059	17,854	18,153	19,551	22,031	12.68
12 మోసాలు	9,072	14,666	21,499	22,996	33,618	46.19
(సైబర్ క్రైమ్ మోసాలు)	(4,517)	(8,826)	(13,895)	(16,339)	(24,643)	(50.82)
13. నమ్మించి మోసం	484	547	461	451	701	55.43
14. నకిలీ..	8	15	18	15	13	-13.33
15 ఇతర ఐపీసీ నేరాలు	75,522	69,653	67,345	70,454	81,194	15.24
15.1 ఎన్డీపీఎస్ కేసులు	431	1,233	1,179	1,360	1950	43.38
15.2 వాహనాల దొంగతనం		-	-	-	-	7595
15.3 రోడ్డు ప్రమాద మరణాలు	5,461	6,395	6,434	6,541	6640	1.51
15.4 రోడ్డు ప్రమాద క్షతగాత్రులు	11,405	12,887	13,063	14,161	16,851	19
మొత్తం నేరాలు	1,19,863	1,25,479	1,31,988	1,38,312	1,69,477	22.53

తగ్గిన రెస్పాన్స్ టైమ్

డయల్ 100కు ఈ ఏడాది 16,92,173 కాల్స్ వచ్చాయి. అయితే నిరుడు డయల్ 100 రెస్పాన్స్ టైమ్ 7 నిమిషాలకు చేరుకోగా.. 2022లో ఆ టైమ్ 5-6 నిమిషాలు ఉన్నది. ప్రస్తుతం డయల్ 100 రెస్పాన్స్ టైమ్ 15 నిమిషాలకు చేరినట్టు బాధితులు చెప్తుండగా.. వార్షిక నివేదికలో ఆ వివరాలను నమోదు చేయలేదు.

మహిళలపై పెరిగిన నేరాలు

వివిధ నేరాలు	2020	2021	2022	2023	2024	పెరిగిన/తగ్గిన శాతం
1. హత్యలు	161	199	181	213	241	13.15%
2. కిడ్నాప్‌లు	682	886	891	884	1,122	26.92%
3. రేప్‌లు	1,934	2,382	2,293	2,284	2,945	28.94%
4. ఆత్మహత్యకు ప్రేరేపించడం	351	355	314	363	379	4.41%
5. వేధింపులు	4,876	4,476	4,964	5,464	5,940	8.71%
6. రెండోభార్య వివాదాలు	115	137	192	178	168	-5.62%
7. వరకట్న హత్యలు	42	33	40	33	22	-33.33%
8. వరకట్న మరణాలు	44	160	126	132	126	-4.55%
9. వరకట్న వేధింపులు	6,544	8,429	9,071	9,458	8,973	-5.13%
10.డీపీ యాక్ట్ కేసులు	4	15	3	4	6	50.00%
మొత్తం	14,853	17,072	18,072	19,013	19,922	2.72%

హెడ్‌కానిస్టేబుల్ ఆత్మహత్య

కొల్చారం, డిసెంబర్ 29 : వ్యక్తిగత కారణాలతో ఓ హెడ్ కానిస్టేబుల్ ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన మెదక్ జిల్లాలో ఆదివారం కలకలం రేపింది. కొల్చారం పోలీస్ స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న సాయికుమార్‌ది ఏపీలోని గుంటూరు జిల్లా. 1992లో ఉద్యోగం పొంది నర్సాపూర్‌లో స్థిరనివాసం ఏర్పర్చుకున్నాడు. నర్సాపూర్, కౌడిపల్లి స్టేషన్లలో పనిచేసి ఏడాది క్రితం పదోన్నతిపై కొల్చారం స్టేషన్‌కు హెడ్‌కానిస్టేబుల్‌గా వచ్చాడు. ఈయనకు భార్యతోపాటు వివాహమైన ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. వ్యక్తిగత కారణాలతో బాధపడుతున్న ఈయన ఆదివారం తాను పనిచేస్తున్న పోలీస్ స్టేషన్ ఆవరణలోని పాత ఎస్సై క్వార్టర్స్ ఎదుట చెట్టుకు ఉరివేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు.

పోలీస్ మిత్రులారా.. ఆత్మహత్యలు వద్దు

- **సమస్య ఏదైనా చావు పరిష్కారం కాదు**
- **పనిఒత్తిడి, హామీలు అమలవకే వరుస విషాదాలు**
- **పోలీసుల సమస్యలు పట్టని కాంగ్రెస్ ప్రభుత్వం**
- **మాజీ మంత్రి హరీశ్‌రావు ఆగ్రహం**

హైదరాబాద్, డిసెంబర్ 29 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో వివిధ కారణాలతో పోలీసులు వరుసగా చనిపోతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని మాజీ మంత్రి హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తంచేశారు. ములుగు జిల్లాలో ఎస్సై, సిద్దిపేటలో కానిస్టేబుల్ కుటుంబం, కామారెడ్డిలో ఎస్సై, కానిస్టేబుల్, ఆదివారం సిరిసిల్లలో కానిస్టేబుల్ కుటుంబం, మెదక్ కొల్చారంలో హెడ్ కానిస్టేబుల్ వీరంతా స్వల్పకాలంలో ఆత్మహత్యలకు పాల్పడ్డారని ఆవేదన వ్యక్తంచేశారు. ప్రజల ప్రాణాలు కాపాడాల్సిన పోలీసులే వరుసగా ప్రాణాలు కోల్పోవడం తీవ్ర ఆందోళన కలిగిస్తున్నదని వాపోయారు. శాంతిభద్రతలను పరిరక్షించాల్సిన రక్షకభటుల జీవితాలకే రక్షణ కరువైందని ఆందోళన వ్యక్తంచేశారు. పని ఒత్తిడి, పెండింగ్ హామీలను నెరవేర్చడంలో ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి పోలీసులపై తీవ్ర ప్రభావం చూపిస్తున్నదని ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పోలీసుల ఆత్మహత్యలపై నిజానిజాలు వెలుగులోకి రావడానికి శాఖపరమైన దర్యాప్తు చేయాలని డీజీపీని కోరారు. పోలీసుల్లో ఆత్మహత్య ఆలోచనలు రాకుండా సైకాలజిస్టులతో కౌన్సెలింగ్ నిర్వహించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. 'మీరు పనిచేస్తేనే సమాజానికి భద్రత.. పోలీస్ మిత్రులారా.. సమస్యలు ఏవైనా ఆత్మహత్యలు పరిష్కారం కాదు. ఎంతో కష్టపడి ఈ ఉద్యోగాలు సాధించారు. మీ కుటుంబ సభ్యులు, తల్లిదండ్రులు మీపై పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయకండి. విలువైన జీవితాలను కోల్పోకండి. ప్రజల ప్రాణాలను కాపాడాల్సిన మీరు ఆత్మస్థయిర్యంతో విధులు నిర్వహిస్తేనే సమాజానికి భద్రత' అని హరీశ్‌రావు సూచించారు.

అప్పులబాధతో పోలీస్ కుటుంబం ఆత్మహత్యాయత్నం

- **ఏఆర్ కానిస్టేబుల్ మృతి**
- **చికిత్స పొందుతున్న భార్యాపిల్లలు**

బాలకృష్ణ (ఫైల్)

సిద్దిపేట టౌన్, డిసెంబర్ 29 : అప్పుల బాధ తాళలేక ఏఆర్ కానిస్టేబుల్ తన భార్యా పిల్లలకు ఎలుకలమందు తాగించి, తాను ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన సిద్దిపేట జిల్లా కేంద్రంలోని కాళ్లకుంట కాలనీలో ఆదివారం కలకలంరేపింది. సిద్దిపేట వన్‌టౌన్ సీఐ వాసుదేవరావు, బాధితుల వివరాల ప్రకారం.. రాజన్నసిరిసిల్ల జిల్లా లింగన్నపేటకు చెందిన బండారి బాలకృష్ణ (34) రాజన్నసిరిసిల్లలోని 17వ బెటాలియన్‌లో ఏఆర్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. కొత్తగా ఇంటి నిర్మాణానికి కొంత అప్పుచేయగా, ముంబయికి చెందిన ఓ ప్రైవేట్ కంపెనీలో రూ.25 లక్షల వరకు పెట్టుబడిపెట్టి మోసపోయాడు. శనివారం రాత్రి విధులు ముగించుకుని ఇంటికి వచ్చి, తాను ప్రైవేట్ కంపెనీలో డబ్బులు పెట్టి మోసపోయానని భార్యతో చెప్పి బాధపడ్డాడు. అప్పుల వారు వేధించకుండా ఉండాలంటే ఆత్మహత్య ఒక్కటే మార్గమని భావించాడు. భార్య మానసకు చాయ్ పెట్టమని చెప్పి ఆమెకు తెలియకుండా అందులో ఎలుకల మందు కలిపాడు. భార్య, కొడుకులు యశ్వంత్, అశ్విత్‌కు ఆ చాయ్ తాగించి తానూ తాగాడు. కొద్దిసేపటి తర్వాత తనకు ఏమీ కాకపోవడంతో పక్క గదిలోకి వెళ్లి ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆదివారం తెల్లవారుజామున మానస పక్కగదిలోకి వెళ్లి చూడగా భర్త ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించాడు. ఎలుకల మందు తాగినవారి ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యులు ధ్రువీకరించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

హనుమకొండ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన మహాసభలో మాట్లాడుతున్న టీయూడబ్ల్యూజే-హెచ్143 రాష్ట్ర అధ్యక్షుడు అల్లం నారాయణ

జర్నలిస్టుల ఇండ్ల స్థలాల కోసం సుప్రీంకు

- **అక్రెడిటేషన్లను భారీగా తగ్గించేందుకు సర్కార్ కుట్ర**
- **జర్నలిస్టులను కుదించే యోచనలో ప్రభుత్వం**
- **టీయూడబ్ల్యూజే-హెచ్143 రాష్ట్ర అధ్యక్షుడు అల్లం నారాయణ**

హనుమకొండ చౌరస్తా, డిసెంబర్ 29: జర్నలిస్టుల ఇండ్ల స్థలాల కోసం సుప్రీంకోర్టులో కొట్లాడుతామని టీయూడబ్ల్యూజే-హెచ్143 రాష్ట్ర అధ్యక్షుడు అల్లం నారాయణ తెలిపారు. ఆదివారం హనుమకొండ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన ఉమ్మడి వరంగల్ జిల్లా మహాసభలో ఆయన మాట్లాడుతూ.. జర్నలిస్టులను విడగొట్టడానికి కొందరు పెద్ద స్థాయిలో తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారని మండిపడ్డారు. జర్నలిస్టులకు ఇండ్ల స్థలాల విషయంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై న్యాయవాదులతో చర్చించి పిల్ వేస్తామని అన్నారు. రాష్ట్రంలో 23 వేల అక్రెడిటేషన్లు ఉన్నాయని, వాటిని తగ్గించడానికి ప్రభుత్వం కుట్రలు చేస్తున్నదని విమర్శించారు. అక్రెడిటేషన్లకు రంగులు మార్చే పనిలో ఉన్నదని, ముఖ్యంగా కొంతమందికి మాత్రమే సెక్రటేరియేట్‌లోకి అనుమతించేలా వాటిని రూపొందిస్తున్నట్టు ఆరోపించారు. జర్నలిస్టులను కుదించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రలు చేస్తున్నదని మండిపడ్డారు. ప్రభుత్వం జర్నలిస్టుల హక్కులను కాలరాసే ప్రయత్నం చేస్తున్నదని, వాటిని తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. జర్నలిస్టుల సంక్షేమం కోసం తమ యూనియన్ ఎప్పుడూ ముందుండి పోరాడుతుందని తెలిపారు. గత ప్రభుత్వంలో జర్నలిస్టులకు హెల్త్‌కార్డులు ఇప్పించినట్టు చెప్పారు. జర్నలిస్టుల సంక్షేమం కోసం గత ప్రభుత్వం రూ.వంద కోట్లు కేటాయించిన విషయాన్ని గుర్తుచేశారు. కరోనా సమయంలో రాష్ట్రంలో 450 కుటుంబాలను ఆర్థికంగా ఆదుకున్నట్టు తెలిపారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో డెస్క్ జర్నలిస్టుల అక్రెడిటేషన్ల కోసం పోరాటాలు చేసిన విషయాన్ని గుర్తుచేశారు. భవిష్యత్ అంతా ఏఐ డిజిటల్ మీడియాదేనని, ఇది ప్రపంచవ్యాప్తంగా రాబోతున్నదని చెప్పారు. యూనియన్ బలోపేతం కోసం వచ్చే మార్చిలో రాష్ట్ర మహాసభలు నిర్వహిస్తామని చెప్పారు. ఈ మహాసభలో యూనియన్ కార్యదర్శి మారు తీసాగర్, సలహాదారు రమేశ్ హజారే తదితరులు పాల్గొన్నారు.

రాబడి

బీమా సేవలు బాగోలేవా

పోర్టబిలిటీతో మరో పాలసీ తీసుకోండిలా

బీమాతో వచ్చే భరోసానే వేరు. ప్రధానంగా ఓ మంచి ఆరోగ్య బీమా పాలసీ.. అత్యవసర సమయాల్లో కొండంత అండగా నిలుస్తుంది. అయితే అదే పాలసీ.. సరైన కవరేజీ ఇవ్వకున్నా, సదరు బీమా సంస్థ సేవలు అసంతృప్తికరంగా ఉన్నా అనవసరపు భారమే అవుతుంది. అందుకే మన అంచనాలకు తగువిధంగా లేని ఆరోగ్య బీమా పాలసీలను పోర్టబిలిటీ ద్వారా మార్చుకునే సౌలభ్యం ఇప్పుడున్నది. అది ఎలాగో మీకు తెలుసా?

ఆరోగ్య బీమా పోర్టబిలిటీ అంటే?

ఆరోగ్య బీమా పోర్టబిలిటీ.. పాలసీదారులకు తమ ప్రస్తుత హెల్త్ ఇన్సూరెన్స్ పాలసీని బీమా ప్రయోజనాలు ఏ రకంగా దెబ్బతినకుండా మరో కొత్త ఇన్సూరర్‌కు మార్చుకునేలా సహాయపడుతుంది. నో-క్లెయిం బోనస్, వెయిటింగ్ పీరియడ్ క్రెడిట్, ఇతర లాభాలను యథతథంగా ఉండేలా చేస్తుంది. ఉదాహరణకు మీకు ఓ రూ.10 లక్షల ఆరోగ్య బీమా ఉన్నది. ఎన్నో ఏండ్లుగా దీనికి ప్రీమియంలు చెల్లిస్తూనే ఉన్నారు. క్రమేణా ఆ ప్రీమియంలు పెరుగుతున్నా.. మీకు మీ బీమా సంస్థ క్లెయింలను సెటిల్మెంట్ చేస్తున్న తీరు మాత్రం నచ్చడం లేదు. ఈ సమయంలోనే రూ.15 లక్షల కవరేజీతో మరో బీమా సంస్థలో ఓ పాలసీ మీ దృష్టి కొచ్చింది. పైగా దీనికి ఇప్పుడున్న ప్రీమియంల కంటే తక్కువే. దాంతో కొత్త పాలసీకి మారాలనుకున్నారు. అప్పుడు పోర్టబిలిటీ సదుపాయాన్ని ఎంచుకోవచ్చు. దీనివల్ల మీ బీమా కవరేజీ రూ.10 లక్షల నుంచి 15 లక్షలకు పెరుగుతుంది.



మార్చుకుంటే ప్రయోజనాలు

- అసంతృప్తికర పాలసీని వదులుకొని పోర్టబిలిటీకి వెళ్తే పాలసీదారులు మరింత మెరుగైన బీమా కవరేజీని పొందవచ్చు.
- పాత పాలసీలోని ప్రయోజనాలు నష్టపోకుండా తక్కువ ప్రీమియంలకే కొత్త ఇన్సూరెన్స్.
- నో-క్లెయిం బోనస్, వెయిటింగ్ పీరియడ్ వంటి ఇతర లాభాలు కొత్త పాలసీలోకి బదలాయింపు.
- మారిన అవసరాలకు తగ్గట్టుగా నూతన పాలసీని కస్టమర్లు మార్చుకొనేందుకు అవకాశం.

మారితే ఎదుర్కోనే నష్టాలు

- పాలసీ రెన్యువల్ సమయంలోనే కొత్త ఇన్సూరెన్స్ సంస్థకు పోర్టబిలిటీ వీలుంటుంది.
- వయసు, ప్రస్తుత ఆరోగ్య పరిస్థితులు, అదనపు కవరేజీ తదితర కారణాలతో ప్రీమియం పెరగవచ్చు.
- బీమా సంస్థ మారితే మీ ఆరోగ్య వివరాలు పూర్తిగా తెలిసేంత వరకు క్లెయింలను కొత్త సంస్థలు ఆలస్యం చేయవచ్చు.
- పాలసీదారులు తమ గ్రూప్ ఇన్సూరెన్స్‌ను వ్యక్తిగత పాలసీగా మార్చుకుంటే పలు ప్రయోజనాలను నష్టపోవచ్చు.

పాత పాలసీలో ఏవైనా నో-క్లెయిం బోనస్‌లున్నా అవీ వర్తిస్తాయి. అలాగే ప్రీమియంలూ తగ్గుతాయి. నెట్‌వర్క్ హాస్పిటల్స్, మెటర్నిటీ లేదా తీవ్ర అనారోగ్య సమస్యల కవరేజీ కూడా బాగుంటుంది.

గుర్తుంచుకోండి..

- ప్రస్తుత పాలసీ గడువు ముగియడానికి కనీసం 45 రోజుల ముందుగానే మీరు కోరుకున్న కొత్త సంస్థకు బీమా పోర్టబిలిటీ విజ్ఞప్తిని చేసుకోవడం మంచిది.
- పోర్టబిలిటీ ద్వారా ఆన్‌లైన్‌లో ఆరోగ్య బీమాను తీసుకోవాలనుకుంటే ప్రీమియం రేట్లు, కవరేజీ, నెట్‌వర్క్ హాస్పిటల్స్, క్లెయిం సెటిల్మెంట్ రేషియో వంటివి వివిధ సంస్థల్లో ఎలా ఉన్నాయో క్షుణ్ణంగా పరిశీలించండి. ఇందుకోసం ఆయా సంస్థల వెబ్‌సైట్లు, మొబైల్ యాప్స్‌ను వాడుకోండి.
- పోర్టబిలిటీ ఫారంలో మీ ఆరోగ్య సమస్యల వివరాలు, ప్రస్తుత పాలసీ, గత క్లెయింలు తదితర సమాచారాన్ని దాచకుండా ఇవ్వండి.
- సంప్రదాయ పద్ధతిలో మీ ప్రస్తుత బీమా పాలసీని ఇతర సంస్థల్లోకి మార్చుకోవాలనుకుంటే ఆయా కంపెనీల ఆఫీసులను సంప్రదించడం ఉత్తమం.